

కథ

# ఒక బాంబు పేలింది!

వేదాంతం శ్రీపతిశర్మ

అయిదు అంతస్తుల ఆ స్కూల్లో ఒక్కసారిగా సంచలనం బయలుదేరింది. పిల్లలు, టీచర్లూ ఎవరు ఎటు పరుగులు తీస్తున్నారో తెలియదు. వాచ్‌మన్ అదే పనిగా విజిల్ వేస్తున్నాడు. వీలైనంత త్వరగా అందరూ బయట పడి పోవాలనే ఆత్రం. అయిదు నిముషాల క్రితమే ఎక్కడినుంచో ఫోన్ వచ్చింది– నాలుగో అంతస్తులోని టాయిలెట్‌లో బాంబు ఉన్నదీ అని! పోలీసులు చిన్న పిల్లల్ని మెట్ల మీద నుండి ఎత్తుకునే దింపేస్తున్నారు. ప్రిన్సిపల్ గదిలోకి ఇద్దరు పోలీసులు, ఇద్దరు టీచర్లు వెళ్లారు. ఆవిడలో ఏ ఆందోళనా లేదు. పోలీసులని ఆవిడే పిలిపించింది.

'మేడమ్...'

'యస్?'

'మీరు కూడా స్కూలు బయటకు వచ్చేయండి. స్నిఫర్ డాగ్స్‌తో వెతికిస్తున్నాము'.

'మరేం ఫరవాలేదు. అన్ని గదులూ ఖాళీ అయినాయా?'

'అవుతున్నాయి మేడమ్. మీరెందుకు రిస్క్ తీసుకుంటారు?'

ఆవిడ కుర్చీలోకి వెనక్కి వాలారు. 'పూర్తిగా స్కూలు ఖాళీ అయిన తరువాతనే చివరగా నేను బయటకు వస్తాను.'

వాళ్లు ఒకళ్ల మొహాలొకళ్లు చూస్కున్నారు. గబగబా బయటకు వెళ్లిపోయి ఆ కార్యక్రమంలో మరింత వేగంగా మునిగిపోయారు.

'ఈవిడ గుండెధైర్యం చూస్తే చిత్రంగా ఉంది..', ఎవరో అంటున్నారు.

'... మామూలుగా అయితే అందరికంటే ఈవిడే ముందు ఇవతలకి వచ్చేది'.

అంత గొడవలోనూ ప్రిన్సిపాల్ చెప్పిన మాట నిప్పులా పాకింది. అందరూ పూనకం వచ్చినట్లు పనిలోకి పూనుకున్నారు. రోడ్డు మీద జనం మూగారు. ఎవరికి తోచింది వారు చెప్పుకుంటున్నారు. దారికి అడ్డంగా నిలబడి ఒకడు అంటున్నాడు, 'అవతలప్రక్క నిప్పు అంటుకుంది, ఫైర్ ఇంజన్ క్లచ్ తెగిపోయి రాలేదుట. మరొకటి వస్తోందిట'.

'కాదు...', ఇంకొకడు అందుకున్నాడు, '... ప్రిన్సిపల్‌గారు తన గదిలో తలుపులేసుకున్నారుట. ఏం జరుగుతోందో తెలియదు!'

ఇంతలో ప్రిన్సిపల్ మేడమ్ అందరికంటే వెనుక ఇవతలకి వచ్చారు.

పోలీసులు కుక్కలతో స్కూలు భవనం యావత్తూ గాలించి కిందకి వచ్చారు.

'మేడమ్, ఏ భయమూ లేదు. బాంబులాంటిదేమీ లేదు. అందరూ లోపలికి వెళ్లవచ్చు. ఏదైనా సమస్య ఉంటే మరల ఫోన్ చెయ్యండి' అని చెప్పి రోడ్డు మీద నిలబడ్డ వారందరినీ అడ్డు తొలగించుకుంటూ పోలీసులు వెళ్లిపోయారు.

క్లాసులు మరల ప్రారంభమయినాయి.

***

మర్నాడు ఉదయం విద్యార్థులందరూ వరుసగా ప్రేయర్‌కు నిలబడ్డారు. గుసగుసలు ప్రారంభమైనాయి. 'రేయ్, ప్రిన్సిపాల్ గ్రేట్ రా'

'ఎందుకు?'

'ఇవతలకి రాకుండా అలా కూర్చోకపోతే అంత తొందరగా అందరూ బయటకు వస్తారా?'

'బాంబు ఏదీ దొరకలేదురా బై! ఆమెనే డ్రామా ఆడిందన్నట్టు!'

'... ...'

మైకు ముందుకు ప్రిన్సిపాల్ మేడమ్ వచ్చారు.

'మై డియర్ చిల్డ్రన్...', అన్నారు, '... మా చిన్నతనంలో కటిక దారిద్ర్యం వలన జీవితాలతో పోరాడుతూ కూడా స్కూళ్లకు వచ్చి చదువుకున్న వారిని చూశాం. ఈ రోజు ఏ రోజు ఏమవుతుందోననే ఒక ఆందోళన అందరి జీవితాలను కమ్మేసిన పరిస్థితులలో మీరు చదువుకుంటున్నారు. ఒక్కొక్కరి జీవితం ఒక్కొక్క పాఠశాలలా సాగిపోతుంది. ఎన్ని పాఠశాలలోకి వెళ్లగలం? మన జీవితం మనకొక్కసారే! నిన్న బాంబు దొరకలేదు. కానీ నేను మీకు నిజమైన బాంబు చూపిస్తాను...'

అక్కడ ఉన్నవాళ్లందరికీ వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి. పిల్లలు స్టేజ్ వైపుకు దగ్గరగా జరిగారు. వాచ్‌మన్ రెండు గుటకలు ఏదో మింగినట్లు మింగాడు. ఆవిడ ఒక కాగితం డైరీ లోంచి లాగారు.

'... దీనిని చదువుతాను. మన స్కూల్లో చదువుకుని వెళ్లిన సౌమిత్ర వ్రాసిన లెటరిది. రెస్పెక్టెడ్ మేడమ్, నేను స్కూల్లో ఉన్నప్పుడు అబ్దుల్ కలామ్‌గారు స్కూలుకు వస్తున్నారు, కేవలం పదిమందిని వాళ్లు అడగదలచుకున్న ప్రశ్నలను బట్టి సెలెక్ట్ చేస్తామన్నారు. నేను పాల్గొన్నప్పటికీ నన్ను సెలెక్ట్ చేయలేదు. నేను కలామ్‌గారిని కలుసుకుని తీరతానని సంకల్పించాను. నేను ఇంజనీరింగ్‌లో ఆల్ ఇండియా రాంక్ సంపాదించి ఈరోజు తిరువనంతపురంలో స్పేస్ ఇంజనీరింగ్ చదువుతున్నాను. ఈ రోజే కలామ్ సార్ మాకు గెస్ట్ లెక్చరర్‌కి వచ్చారు. ఈ రాత్రి ఎందుకో నిద్ర పట్టటం లేదు. ఈ లెటర్ వ్రాసేసాను కాబట్టి ఇక పడుతుందనుకుంటున్నాను...'

మేడమ్ కొద్దిసేపు ఆగారు. పూర్తి నిశ్శబ్దం కమ్ముకుంది. ఒక టీచర్‌గారు చప్పట్లు కొట్టారు. మరొకరు అనుసరించారు. మెల్లగా ఆ ప్రాంగణంలోని వారందరి హృదయాలలో గంటలు మ్రోగినట్లు చప్పట్లు మారుమ్రోగాయి.

'నాలుగైదు వైర్లు కనెక్ట్ చేసి ఇగ్నైట్ చేస్తే ఏ బాంబైనా పేలుతుంది. మనందరిలో కలిగే అంతర్మథనాన్ని సరైన దిశలో ఇగ్నైట్ చేస్తే జీవితం రాకెట్‌లా పైకి ఉరుకుతుంది. నాలుగు వెర్రి ఆలోచనలని వైర్లలా కలుపుకుని ఎక్కడో దాక్కున్న వారందరికీ నేనిస్తున్న సందేశమిది. ఏమో... ఈ లెటర్ చదవకపోతే నేనూ అందరిలా బయటకు పారిపోయేదాన్ని! 'ఇగ్నైటెడ్ మైండ్స్'- పుస్తకంలో బాధ్యత, నాయకత్వం గురించి నేనూ చదివాను. పాఠం నిన్ననే నేర్చుకున్నాను. జై హింద్!'

●

# అతిసారకి హోమియో చికిత్స

వర్షాకాలంలో నీళ్ళు కలుషితం కావడం వల్ల వచ్చే వివిధరకాల జబ్బులు వస్తాయి. కనుక వర్షాకాలం చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అతిసార ఇతర రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఆహారం, పరిసరాల పరిశుభ్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. విరేచనం మామూలుగా కన్నా పలచగా గానీ, నీళ్ళగా కానీ, ఎక్కువసార్లు అవడాన్ని 'అతిసార' అంటారు. వర్షాకాలంలో ఎక్కువమంది పిల్లలు ఈ వ్యాధికి లోనవుతుంటారు. చిన్న పేగుల్లో ఉండే వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడమే దీనికి కారణం. ఇలా ఎక్కువసార్లు మలవిసర్జన జరిగితే ఆసుపత్రికి తీసుకెళ్ళి చూపించాలి. ఏవో మందులు వాడి అదే తగ్గిపోతుంది లెమ్మని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం లేకపోలేదు.

విపరీతంగా కడుపునొప్పి రావడం, రోగి నిస్త్రాణగా మారిపోవడం, నీరసం ఆవహించడం, మలమార్గంలో మంట వంటి లక్షణాలు కనిపిస్తే దానిని అతిసార వ్యాధిగా భావించాలి. ఈ లక్షణాల్ని గుర్తించిన వెంటనే రోగిని వైద్యుల దగ్గరికి తీసుకెళ్ళాలి. బాగా నీరసపడిపోవడం వల్ల రోగికి వెంటనే నోటి ద్వారా సోడియం లవణాల్ని, గ్లూకోజ్‌ని ఇచ్చి రోగ నిరోధకశక్తిని పెంచవచ్చు. అతిసార వ్యాధిగ్రస్తులకు వెంటనే ఆహారం ఇవ్వకూడదు. వ్యాధి కొంత తగ్గుముఖం పట్టేవరకు వేచి చూడాలి. అతిసారకి లోనైన వ్యక్తికి తగిన విశ్రాంతి అవసరం. ఈ సమయంలో రోగికి బియ్యం, సగ్గుబియ్యం, గోధుమనూకతో తయారుచేసిన జావ ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. ఆరోగ్యం త్వరగా కుదుటపడుతుంది. ఈ సమయంలో మంచినీళ్ళు తాగాలనిపిస్తే కాచి వడగట్టిన నీళ్ళనే తాగించాలి. ఈ నీళ్ళలో కూడా ఎలక్ట్రాల్ పౌడర్ కలిపి తాగిస్తే మంచిది.

వర్షాకాలంలో వీలైనంతమటుకు నీళ్ళను వేడి చేసి చల్లార్చి తాగడం మంచిది.

ఆరోగ్యం

అతిసార వ్యాధికి హోమియో వైద్యవిధానంలో మంచి మందులున్నాయి. వాటిని వైద్యుల సలహా మేరకు వాడితే మంచి ఫలితాలు ఉంటాయి. ముఖ్యంగా ఈ కింది మందులు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి.

**పోడో ఫైలం 200:** తెల్లవారుజాము నుంచి పగటి పూట దాకా అయ్యే పెద్ద పెద్ద నీళ్ళ విరేచనాల నుంచి ఉపశమనం పొందడానికి ఈ మందు బాగా పని చేస్తుంది. చిన్న పిల్లలలో దంతాలు వచ్చేటప్పుడు అయ్యే విరేచనాలకి కూడా ఈ మందు వాడవచ్చు.

**విపరీతంగా కడుపునొప్పి రావడం, రోగి నిస్త్రాణగా మారిపోవడం, నీరసం ఆవహించడం, మలమార్గంలో మంట వంటి లక్షణాలు కనిపిస్తే దానిని అతిసార వ్యాధిగా భావించాలి.**

**ఆర్సనికం ఆల్బం 200:** మలమార్గంలో మంట, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో రక్తం కలిసిన విరేచనాలు, దుర్వాసనతో కూడిన విరేచనాలు అయినప్పుడు వాడాలి.

**ఎథూజా 200:** పసిపిల్లలకు పాలు పడక అయ్యే విరేచనాలకి, పాలు తాగగానే పసరుగా అయ్యే విరేచనాల నివారణకి ఈ మందు వాడటం మంచిది. ఇలాంటి స్థితిలో వాంతులు, ఫిట్స్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. ఆ సందర్భాల్లో ఈ మందు వాడాలి.

**ఎకోనైట్ 200:** ఎండాకాలంలో వచ్చే విరేచనాలు, దాహం, చలి జ్వరాలకి ఇది ఉపయోగపడుతుంది.

**విరేట్రం ఆల్బం 200:** ఒళ్ళంతా చెమటలు పట్టడం, శరీరం నీలి రంగులోకి మారటం, వెంటవెంటనే విరేచనాలు అవడం వంటి లక్షణాలుంటే ఈ మందు వాడాలి.

ఇలా అతిసార వ్యాధి నుంచి కోలుకోడానికి హోమియో వైద్యవిధానంలో అనేకరకాల మందులున్నాయి. అయితే వైద్యుల సలహా మేరకు మాత్రమే ఈ మందులు వాడాలి. పైన చెప్పినట్టు ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల దగ్గరకు వెళ్ళడం తప్పనిసరి. అలాగే పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. మంచినీళ్ళను వేడిచేసి చల్లార్చి తాగాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు ఈవిధంగా చేస్తే కలుషిత నీటి నుంచి వచ్చే అనేక వ్యాధులకు దూరంగా ఉండే అవకాశముంది. కనుక వ్యాధి రాకుండానే తగిన ముందుజాగ్రత్తలు తీసుకోడానికి ప్రయత్నించాలి.

- డాక్టర్ దండెపు బస్వానందం